ఆధ్యాత్మిక అంతర్జాల పత్రిక

# శ్రీసన్నిధానం

సంపుటి 02 సంచిక 06

జూన్ 2023



# శ్రీసన్నిధానం

srisannidhanam.org

## విషయం


3. సంపాదకీయం
4. నెలవారి పంచాంగం
5. పూరి జగన్నాథ్ ప్రత్యేకము
6. రామానుజ సుధామాధురి
7. శ్రీనమ్మాళ్వార్ కృష్ణ తృష్ణ
9. శ్రీపతిస్తుతి
10. భగవత్ గుణానుభవం భక్తి మాధుర్యం
11. భాగవతంలో భగవంతుని కథలు
12 సాంప్రదాయ ధురీణులు
13. జ్యోతిర్విజ్ఞానమ్
16. ఆధ్యాత్మిక వార్తలు



### సంపాదక మండలి

వొద్దిపర్తి రామచంద్రమూర్తి చీఫ్ ఎడిటర్

సముద్రాల శారద వొపీనియన్ ఎడిటర్

డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

### గౌరవ సంపాదకులు

శ్రీమాన్ శ్రీ నంబి వేణుగోపాలాచార్య కౌశిక

శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి ఆచార్య

శ్రీమాన్ శ్రీ అమరవాది వెంకటనర్సింహా చార్యులు




# ముఖచిత్ర పరిచయం

ఏకాదశి నియమం పాటించే ఆచారం ఉన్నవారు జీవితంలో ఒకమారైనా పూరీ జగన్నాథుని దర్శించాల్సిందే. జగన్నాథ దర్శన భాగ్యంతో వారు జీవితకాలం ఏకాదశి వ్రతమాచరించిన పుణ్యం దక్కుతుందని పెద్దలమాట. ఆ స్వామి దర్శనానికి అంత విశిష్టత. మూల మూర్తి మారే స్వామి, ఎప్పటికప్పుడు కొత్త రథంలో ఊరేగే స్వామి. పేదా గొప్పా భేదంలేదు. స్వామి దర్శనానికి ప్రముఖులు వచ్చినా, అనాదిగా వస్తున్న ఆచారాన్నే పాటిస్తారు. రాజైనా పేదైనా ఇక్కడ భేదాలుండవు. జగన్నాథయాత్ర సందర్భంగా నాడు రాజులు రథం ముందు బంగారు చీపురుతో వూడ్చేవారని చెపుతారు. నేటికీ రాజవంశీయులు ఆ ఆచారాన్ని పాటిస్తారు. కొత్తకుండలో వండటం, చమురు (నూనె) ఉపయోగించక పోయినా వండిన పదార్థం రుచిగా ఉండటం ప్రత్యేకత. నేటికీ జగన్నాథ స్వామివారికి 56 రకాల పదార్థాలను వండి నివేదిస్తారు. మధ్యాహ్నం సమయానికి భగవంతుడు పూరీలో కొలువుంటాడని ప్రగాఢనమ్మకం. ఈ దేవాలయాన్ని భగవత్ రామానుజాచార్యుల వారు, ఆదిశంకరాచార్యుల వారు సందర్శించారు. వారు ఏర్పాటుచేసిన గోవర్ధన పీఠం, మఠాలు మనకు నేటికీ దర్శనం ఇస్తాయి. గురునానక్, కబీర్, తులసీదాస్ లాంటి మహనీయులు కూడా ఈ ఆలయాన్ని దర్శించిన ఆధారాలున్నాయి. నిత్యనూతన శోభతో సోదర,సోదరీ కూడా ప్రేమకు ఆదర్శంగా అలరాలే జగన్నాథ, బలభద్ర, సుభద్ర మూర్తులను ముమ్మూర్తులా శ్రీమాన్ డింగరి సంపత్ కుమారాచార్య ఆవిష్కరించారు.


PUBLISHED BY : డింగరి శ్రీనివాసమూర్తి మేనేజింగ్ ఎడిటర్

చిరునామా: ఇ.నెం 10-2-225, విద్యానగర్ కరీంనగర్ ,తెలంగాణా - 505001 ఫోన్ : 878 2253323 ; 9502583323;



నోట్:- సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు మీరూ మాతో కలిసినడువండి! అంతర్జాలంలో పబ్లిష్ చేసేవారు 'శ్రీసన్నిధానం సంచిక నుంచి సేకరణ' అని రాయడం మరువకండి!! కాపీ రైట్ చట్టానికి కట్టుబడి ఉందాం.

# సంపాదకీయం

# వేసవి శిబిరాలు వెలుగు జీవనరేఖలు



వారసత్వంగా వస్తున్న సంస్కృతీ సంప్రదాయాల పరిరక్షణకు ధార్మిక సంస్థలు, వాటి అనుబంధ శిక్షణ సంస్థలు నూతన వెలుగురేఖలను మనముందు ప్రతి యేటా వేసవి సెలవులు వచ్చిన సందర్భంగా ఆవిష్కరిస్తున్నాయి. నిత్యం పోటీ పరీక్షలతో పరుగులు పెడుతున్న విద్యార్థుల మనోవికాసానికి పదును పెట్టడానికి ఇవి దోహదపడుతున్నాయనడంలో సందేహంలేదు.

మానసిక వికాసం కలిగించేది ధ్యానం. నిత్యం ధ్యానం చేస్తున్న వారి జ్ఞాపకశక్తి వృద్ధి చెందుతుందనడంలో అతిశయోక్తి లేదు. ముందుగా ఇందులో అగ్రతాంబూలం ప్రజ్ఞ శిక్షణదే అని చెప్పవచ్చు. ఇది దేశ విదేశాలలో అత్యంత ఆదరణీయంగా దిన దినదినాభివృద్ధి చెందుతోంది. ప్రారంభంలో విదేశాలలో ఉన్న భారతీయులకు ఆధ్యాత్మిక వికాసాన్ని అందించడానికి జెట్ 'ప్రజ్ఞ' ప్రారంభించినా క్రమంగా స్వదేశంలో కూడా ఆ పరిమళాలను వెదజల్లడానికి వికాసతరంగిణి ప్రయత్నిస్తోంది. ఉభయ తెలుగు రాష్ట్రాలలో వికాసతరంగిణి చిన్నారులకు ప్రజ్ఞ శిక్షణ నిర్వహిస్తోంది. చిన్నారులతో ప్రాతస్మరణీయాలు వల్లెవేయిస్తూ రేపటి ఆధ్యాత్మిక జీవనజ్యోతులను వెలిగిస్తోంది. రోజుకు ఒకశ్లోకం నేర్చుకుంటూ వెళితే వాటి అర్థం పరమార్థం తెలుసుకుని జీవన విలువలు తెలుసుకున్న సందర్భాలు అనేకం. హిందూ ధర్మాన్ని మనకు రంగరించి అందించిన భగవద్గీత అధ్యయనంవల్ల నేడు మనం చెప్పుకుంటున్న పర్సనాలిటీ డెవలప్‌మెంట్ అభివృద్ధి చెందుతుందనడానికి ఆధారాలు ఎన్నోఉన్నాయి. ఈ విషయాన్ని గమనించిన మానవవనరుల శిక్షణ సంస్థలు భగవద్గీత శ్లోకాలను కంఠస్థం చేయించే పని చేపట్టి కెరీర్‌లో విజయ బాటను రాచబాటగా వేస్తున్నాయి.

గీతా రహస్యాలను మనకు అందించడంలో త్రిమతా చార్యులు మొదలుకుని నేటి ఆధునిక సమాజం ఆదర్శంగా తీసుకున్న స్వామీ వివేకానంద వరకు ఎందరో మహానుభావులు విజ్ఞానపు వెలుగులు అందించడానికి ప్రయత్నించారు. ఆసారాన్ని అందుకోడానికి ప్రయత్నించిన వారిలో నేటి బ్రిటన్ ప్రధాని ఉన్నారు. అబ్దుల్ కలాం కూడా ఉన్నారు.

సంకీర్తనం ద్వారా సర్వారోగాలను హరించవచ్చు అన్న భావనతో అవధూత దత్తపీఠం ప్రపంచవ్యాప్తంగా భక్తిమార్గంలో నడిపే యత్నాన్ని చేస్తోంది. లక్షలాది మంది ఒకే మారు గీత పాటలా ఒకేమారు పారాయిణం చేసేలా శిబిరాలు నిర్వహిస్తోంది. ఆత్మవిశ్వాసాన్ని కల్పించి జీవనమార్గాన్ని సుగమం చేస్తోంది.

ఇంతెందుకు సెలవుల్లో సరికొత్త ప్రాజెక్టులు ఇవిగో అంటూ కాన్పూర్ ఐఐటి ఒక నూతనాధ్యాయాన్ని ప్రారంభించింది. ఈశావాస్య ఉపనిషత్తు మొదలుకుని ముక్తికా ఉపనిషత్తు వరకు 108 ఉపనిషత్తులు అధ్యయనం చేసి పరిశోధన చేసే అవకాశం కల్పించింది. ఇదేమిటీ అని అడిగిన వారికి ఇది చతుర్విధ వేదాలసారం సుమా అంటూ నేపాల్ నుంచి వేదాధ్యయనం చేసినవారిని ప్రత్యేకంగా రప్పించి ఉపన్యాసాలు ఇప్పించి విద్యార్థులలో చైతన్యం కలిగించిన సందర్భాలు ఉన్నాయి. కన్యాశుల్కంలో గిరీశం అన్నట్లు అన్నీ పుస్తకాల్లో ఉన్నాయుష..!! వేదాల్లో ఉన్నాయుట!! అనుకుంటే సరిపోదు నూతనాధ్యాయం ప్రారంభించాలి. అంటే... సంస్కృతా ధ్యయనం చేయాలి. ఇందుకోసం ఉచితబోధన ఉంది సుమా అంటూ ప్రచారం చేస్తున్న సంస్థలు మన తెలుగు నేలపై చిల్కూరు బాలాజీ సాక్షిగా కనిపిస్తున్నాయి. సకల విద్యలకు తల్లి సంస్కృతం అధ్యయనం చేయండి! జీవనవికాసానికి దోహదం చేస్తుందని చెబుతున్నారు. టిటిడి ధర్మప్రచార సంస్థలు, ధార్మిక సంస్థలు ఒక అడుగు ముందుకు వేసి పాఠ్యాంశాలను బోధించడమే కాదు, పాఠ్యపుస్తకాలనుసైతం ఉచితంగా అందించే పనిని చేపట్టారు. విజ్ఞాన సముపార్జనకు వయస్సుతో నిమిత్తంలేకుండా నిరంతర అధ్యయనంవల్ల మన సంస్కృతీ సంప్రదాయాల విలువలు భావితరాలకు తెలిసే అవకాశం ఉంది. మీరూ చేయూత నివ్వండి. పిల్లలను ప్రోత్సహించండి.

–ఔద్దపర్తి రామచంద్రమూర్తి (చీఫ్ ఎడిటర్)

# నెలవారి పంచాంగమ్

జ్యేష్ఠ మాసం 20-05-2023 శుక్ల పక్షంతో ప్రారంభమై 18-06-2023 వరకు. తదుపరి ఆషాఢ మాసం.

07-06-2023 వరకు రోహిణి కార్తి, 08-06-2023 నుండి 21-06-2023 మృగశిర కార్తి, 22-06-2023 నుండి ఆర్ద్ర కార్తి.
**పండుగలు :** 01-06-2023 అళగియసింగర్ తిరునక్షత్రం, బాలల దినోత్సవము, 02-06-23 నమ్మాళ్వార్ తిరునక్షత్రం, 04-06-23 ఏరువాక పూర్ణిమ, వట సావిత్రి వ్రతం 14-06-23 సర్వేషాం యోగినైకాదశి, 07-06-23 సంకష్టచతుర్థి, 16-06-23 మాస శివరాత్రి, 18-06-23 అమావాస్య, 20-06-23 పూరీజగన్నాథ రథయాత్ర , 25-06-23 భాను సప్తమి 28-06-23 లక్ష్మీవ్రతారంభం 29-06-23 సర్వేషాం తొలి శయనైకాదశి, 30. వాసుదేవ ద్వాదశి.

## మాస ఫలాలు

**మేషం:** ఈ నెల బాగుంది. ఆరోగ్యం కుదుట పడును. ఆదాయం బాగుండును. చేయు వృత్తి వ్యాపారములందు రాణింపు ఉంటుంది. ఉత్సాహంతో ముందుకు పోగలరు. గృహనిర్మాణాలు కలిసివచ్చును.

**వృషభం:** ఈ నెలయందు పరిస్థితులు అనుకూలించును. చేయు వృత్తి వ్యాపారములందు అభివృద్ధి, ఆదాయం పెరుగును. ప్రతీ విషయంలో ధైర్యంగా ముందుకు పోగలరు.

**మిథునం:** ఈ నెల మీ మాటకు తిరుగుండదు. ఆదాయం బాగుంటుంది. మంచివార్తలు వింటారు.

**కర్కాటకం:** ఈనెల అనుకూలంగా లేదు. చిన్నవిషయానికి ఉద్రేకులగుట. అందరితోనూ విరోధాలు, అవమానకర సంఘటనలు జరుగును.

**సింహం:** ఈనెల వృత్తి వ్యాపారాలందు రాణింపు, ఆదాయం బాగుండును. ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యలాభం, బంధుమిత్రసంతోషాలు, శత్రుజయం.

**కన్య:** ఈ నెల కొంతఫర్వాలేదు. చేయువృత్తి వ్యాపారాలందు అన్ని రంగాల వారికి బాగుండును. ఆదాయం బాగుంటుంది. కొన్ని సమస్యలు తొలగును. కుటుంబంలో సంతోషాలు,

**తుల :** ఈ నెల అనుకూలంగా అన్నిరంగాల వారికి చేయువృత్తి వ్యాపారములందు అనుకూలం. ఆర్థిక పరిస్థితి బాగుంటుంది. ఆరోగ్యం కూడా బాగుండును. ధైర్యంతో ముందుకు పోగలరు.

**వృశ్చికం:** ఈనెల స్వల్ప ఇబ్బందులు శారీరక శ్రమ అధికం. అసహనంతో ఉంటారు. ఆర్థికంగా మాత్రం బాగుంటుంది. పీడకలలు, సంతానము ద్వారా సౌఖ్యం, ఆనందము.

**ధనుస్సు:** ఈనెల కొంతమేర ఇబ్బందులు కలిగించును. శారీరకశ్రమ అధికంగా ఉండుట, ప్రయాణాలందు ఇబ్బందులు, వాహన ప్రయాణంలో జాగ్రత్త అవసరం. వ్యవహారాలు కలిసి వచ్చును.

**మకరం:** ఈ నెల అనుకూలం. ఆదాయం బాగుంటుంది. ఆరోగ్యలాభం, ప్రయాణ, కుటుంబ సౌఖ్యం, సోదరులు, మిత్రులు సహాయం అందించెదరు.

**కుంభం:** ఈనెలలో చేయు వృత్తి వ్యాపారాలు అన్నిరంగాలలో అనుకూలం. ధనమునకు ఇబ్బంది ఉండదు. పనులు ఆఖరి నిమిషంలో పూర్తగును.

**మీనం:** ఈనెల అనుకూలంగానే ఉండును. వ్యాపారులకు మంచి వ్యాపారములు జరుగును. ఆరోగ్యం బాగుండును. ఆర్థికంగా బాగుండును. సంతాన సౌఖ్యం, సంతోషకర వార్తలు వింటారు.

గృహప్రవేశమున మంగళ వాద్యములు, బ్రాహ్మణులు, సువాసినులు, పూజా ద్రవ్యములతో, గోవుతోను, యజమానిపత్నీ సమేతముగా పూర్ణ కలశముతో కవాటము పూజించి గృహప్రవేశము చేసి, తదుపరి స్వస్తివాచనాది వేదమంత్రములతో గృహ శుద్ధి గావించి దేవతలను, అగ్నిని, వాస్తు పురుషుని ప్రతిష్ఠించి హెూమ, కళ్యాణములు చేయవలెను.

## మంచి రోజులివిగో...

**జేష్ఠ మాసం జూన్ నెలలో 01-06-2023, 3, 7, 8, 9, 11, వివాహములు, 5, 8, 14 గృహ ప్రవేశ, గృహ ఆరంభములు, 1,6,14 ప్రతిష్ఠా ముహూర్తములు శుభ ముహూర్తములు.**



# పురుషోత్తమ క్షేత్రం, పూరీ జగన్నాథం

ప్రాచీనంగా పురుషోత్తమ క్షేత్రం గా మనకు పురాణాల్లో పేర్కొన బడింది ప్రసిద్ధ పూరి క్షేత్రం. తూర్పు సముద్రానికి తీరంలో ఉన్న సుప్రసిద్ధ మైన క్షేత్రం. అనేక ఆశ్చర్యాలకు నెలవైన పుణ్యక్షేత్రం. శ్రీకృష్ణ పరమాత్మ తాను జగన్నాథుడుగా అక్కడ ఆవిర్భవించాడు అని పురాణాలు పేర్కొంటున్నాయి. ఇంద్రద్యుమ్నుడు అనే మహారాజు ఒక ఆలయాన్ని నిర్మిద్దామనుకొని నీలాచలం ప్రాంతంలో, ఒక స్తపతి ద్వారా స్వామి విగ్రహాలను చెక్కించాలనుకున్నాడు. పూర్తయ్యే లోపల తలుపులు తీయవద్దని స్తపతి ఒప్పందంపై మహారాజు అనుమతిని ఇచ్చాడు. విగ్రహాలను చెక్కడానికి చాలాకాలం పట్టింది. ఏం జరుగుతుందో చూద్దామని మహారాజు తలుపుతీయగానే స్తపతి అదృశ్యమయ్యాడు. అప్పుడు అసంపూర్ణమైనవిగా విగ్రహాలు ఉన్నాయి. ఈనాడు అవి మనకు పూరి జగన్నాథ క్షేత్రంలో పూర్తి కాకుండా మొండిగా ఉన్న జగన్నాథ బలభద్ర సుభద్ర విగ్రహాలు కనిపిస్తాయి. అదే భగవత్ సంకల్పం అని క్షేత్ర పురాణం ద్వారా మన పెద్దలు చెప్తూ ఉంటారు. అదొక గొప్ప ఆశ్చర్యము. అంతేకాక పూరి జగన్నాథ్ క్షేత్రంలో ఉన్న అర్చామూర్తులు పూర్తిగా దారువులతో నిర్మిస్తారు. ఆ దారువులు కొన్ని సంవత్సరాలకు మారుస్తుంటారు. అలా మార్చే విధానం వేదకాలం నుంచి ఉన్నది. పూరి పురుషోత్తమ క్షేత్రంలో జగన్నాథుడి హృదయ స్థానంలో దారు మూర్తులలో కృష్ణ పరమాత్మకు సంబంధించిన ఆత్మ పదార్థాన్ని అర్చకస్వాములు ప్రత్యేక సందర్భాల్లో పాత విగ్రహాల్లో నుంచి కళ్ళకు గంతలు కట్టుకుని చీకటిలో మార్చుతారు. ఇదొక ఆశ్చర్యం. ఇతరమైన క్షేత్రములలో ఉండే ఆచారముల కంటే విభిన్నమైన పద్ధతిలో అనేక ఆచారాలు, ఆశ్చర్యకరమైన నిదర్శనాలు కూడా కనిపిస్తాయి.

పూరీక్షేత్రాన్ని జగన్నాథక్షేత్రము, పురుషోత్తమక్షేత్రము, శ్రీక్షేత్రము అని కూడా అంటారు. శ్రీక్షేత్రము అనడంలో ఏమిటి ఔచిత్యము అనగా ఎక్కడైనా ప్రధానమైన దైవం ఎవరైతే ఉన్నారో ఆ దైవం పేరు మీదే అక్కడ క్షేత్రంగాని, ఆలయం గాని పిలువబడుతుంది. అందుకే పురుషోత్తమ క్షేత్రం, పూరీ జగన్నాథం అంటాము. జగన్నాథ ఆలయం పేరైనప్పటికీ సుభద్రాదేవి మధ్యలో ఉండి ఒక వైపున జగన్నాథుడు ఇంకోవైపు బలభద్రుడు ఉండటం పూరీ క్షేత్రంలో మనకు ప్రధానంగా కనిపిస్తుంది. మధ్యలో ఉండే దైవం ప్రధాన దైవం మవుతుంది. అక్కడ అమ్మవారి శక్తికి ప్రాధాన్యత ఉండటం వల్ల శక్తి స్వరూపంగా ఉన్న సుభద్రాదేవి ప్రధానంగా కనిపిస్తూ ఉండటం వలన ఈ క్షేత్రానికి శ్రీ క్షేత్రమని పేరు. పూరీ జగన్నాథం లో ఇదొక గొప్ప విశేషం.

ఇంకా లోకంలో సుభద్రా అనే ఆవిడ జగన్నాథుడికి చెల్లెలా?


**శ్రీమాన్ శ్రీ కె. ఇ. స్థలశాయి స్థానాచార్యులు**

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం భద్రాచలం**


భార్యయేనా? అని ఒక సందేహం కూడా కనిపిస్తూ ఉంటుంది. కానీ మనకు పురాణాలలో కృష్ణునికి చెల్లెలుగా సుభద్ర కనిపిస్తుంది. కానీ ఇక్కడ ఉండే జగన్నాథుని భార్యకు సుభద్ర అని కూడా ఒక పేరు ఉన్నది అనే కథనం వినిపిస్తుంది. అందుకే కృష్ణునికుండే పదహారువేలమంది భార్యల్లో ఒక భార్య సుభద్ర అనే కథనం ఉన్నది. ప్రధానంగా శ్రీవైష్ణవ సంప్రదాయంలో **"నీలాచల నివాసాయ నిత్యాయ పరమాత్మనే సుభద్రా ప్రాణనాథాయ జగన్నాథాయ మంగళం"** అని మంగళాశాసనం చేస్తారు. ఈ క్షేత్రంలో జగన్నాథుడికి పురుషోత్తముడు అని పేరు. క్షేత్రానికి కూడా పురుషోత్తమమని పేరు. అదే పూరి పేరుతో పిలవబడుతోంది.

పూరి అంటే పురము అని అర్థం. పురిషేతే పురుషః అని వ్యుత్పత్తి. మన దేహములన్ని పురములైతే, ఆ పురములలో అంతరాత్మగా, అంతర్యామిగా భగవంతుడు ఉంటాడు. కనుక ఇతనికి పురుషుడు అని పేరు. పురుషులలో ఉత్తముడైనటువంటి వాడు భగవంతుడు. ఇది **"ఉత్తమః పురుష స్త్వన్యః పరమాత్మే త్యుదాహృతః"** అని భగవద్గీతలో చెప్పబడింది. ప్రకృతి సంబంధమైన దేహమును నడిపించే ఆత్మ అణు స్వరూపంగా ఉంటుంది. ఆత్మ లోపలవుండే పరమాత్మను నేను. అని కృష్ణపరమాత్మ భగవద్గీతలో చెప్పాడు. అనగా ఈ దేహంలో ఆత్మ కంటే ఉత్తముడైనవాడు, అన్యుడైనవాడు, ఆ ఆత్మను ప్రకృతిని నడిపించేవాడు పరమాత్మ ఆయన పురుషోత్తముడే! ఆ పురుషోత్తముడు కృష్ణ పరమాత్మ. ఈ విధంగా పురుషోత్తమ క్షేత్రం అని చెప్పడం గొప్ప విశేషం. కృష్ణుడు, బలభద్రుడు, సుభద్ర అనే పేర్లతో పాటుగా, ఆయన రాముడే అని! అది **"అగ్రతః ప్రయయౌ రామః సీతా మధ్యే సుమధ్యమా పృష్ఠతస్తు ధనుష్పాణిర్లక్ష్మణోను జగామహ"** అని వాల్మీకి రామాయణంలో వాల్మీకి మహర్షి ఆశ్చర్యపోతూ ముందు రామచంద్రమూర్తి, మధ్యలో సీతమ్మ, వెనక లక్ష్మణస్వామి నడుస్తున్నారు అని చెప్పి అది ఓంకారం ఉన్నట్లుగా ఉన్నది అని అంటారు. (మిగతా 8వ పేజీలో)

# శిష్య వాత్సల్య నిధి అమృత జలధి

**- శ్రీమతి సముద్రాల శారద**

తత్వహిత పురుషార్థములు అనేవి ఉజ్జీవించాలని అనురక్తి గల వారికి ముఖ్యమైన విషయాలు. వీటిని మూలంగా చేసుకొని సంప్రదాయ అనుసరణము ఆచరణ ఆలోచనలు నిర్దేశించబడతాయి. అటువంటి అమూల్య సాంప్రదాయ సంపద మన పూర్వాచార్యుల నుండి పెద్దల నుండి పరంపరగా అందించబడుతున్నది. పూర్వం విద్యా విధానాల ద్వారా సంప్రదాయ విస్తరణ ప్రభావితమైయ్యేది. ముఖ్యంగా శిష్య పరంపరల వలననే అధ్యయనము, జ్ఞాన వితరణము రెండు సమాంతరంగా సాగి సంప్రదాయ విస్తరణ జరిగింది. శిష్యులు అంటేనే ఆచార్యుల తేజస్సును ఇనుమడింప చేసేవారు. గురువుల గరిమను, వైభవాన్ని చాటి చెప్పేవారు. సదాచార్యుల శిష్యులు సదాచార సిరులు తరతరాల వరకు శాశ్వతంగా నిలిచేలా చేశారు. "శిష్యవాత్సల్య నిధి" అయిన శ్రీభగవద్రామానుజా చార్యులను ఎంతోమంది శిష్యులు కైంకర్య నిష్ఠతో సేవించారు. వేద వేదాంగాలను శాస్త్రాలను అభ్యసించడమే కాకుండా అనుష్ఠాన మార్గాలను నేర్చుకున్నారు. సిద్ధాంత ప్రచారంలో, సంప్రదాయ పరిరక్షణలో, ప్రబోధనలలో జగదాచార్యులంతటి ప్రసిద్ధత ను వారు కూడా పొందారు. "తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా। ఉపదేక్ష్యంతి తే జ్ఞానం జ్ఞానినస్తత్త్వదర్శినః॥" సాష్టాంగ నమస్కారం చేసి, వినయంతో ప్రశ్నించి, శుశ్రూష చేసి, తత్త్వదర్శనులైన జ్ఞానుల వద్ద జ్ఞానాన్ని తెలుసుకోవాలి." అన్నట్లు వారంతా గురు శిశ్రూష చేసి ఆచార్య అనుగ్రహాన్ని పొందారు. శ్రీరామానుజాచార్యులు కూడా శిష్య పరంపరకు వాత్సల్య నిధిగా నిలిచి శాస్త్ర జ్ఞానం అనే అమృత జలధిని పంచారు. ఆ క్రమంలో సిద్ధాంత వాఙ్మయంతో పాటు సాంప్రదాయ ఆచరణలు కూడా విస్తరిల్లాయి.



వారు ఏర్పాటు చేసిన 74 పీఠాధిపతులుగా శిష్యులు ఆచార్య స్థానమందు జగదాచార్యులకు ప్రతినిధులుగా నిలిచారు "చక్రాంకితాః ప్రవేశితవ్యాః" అన్నట్లు శ్రియ పతి సారూప్య, సామీప్య, సాయుజ్యములను పొంది పరమపదంలో ప్రవేశించాలంటే పంచసంస్కారములు పొందాలని శాస్త్ర వచనం. అటువంటి పరంపరాగత విధానాన్ని శ్రీ రామానుజాచార్యులు ఏర్పాటు చేశారు. అందుకే వారు శిష్యాగ్రేసరుల చేత "యతిరాజేన నిబద్ధ నాయక శ్రీః మహతీ గురు పంక్తి హార యష్టిః" యతీంద్రులనే నాయకమణిచే కూర్చ బడినది గురుపరంపర అనే ముత్యాల హారం! అని శ్లాఘించబడ్డారు. యతి రాజులకుండే హృదయ మార్ధవం, దివ్య సుందర స్వరూపం, వేద వేదాంగ శాస్త్ర పురాణ పాండిత్యం, ఆళ్వారాచార్యులపై గల భక్తి భావం ఎందరో శిష్యులను దగ్గర చేశాయి. భారతీయ సంస్కృతికి వేద ధర్మానికి మూలమైన గురు శిష్య సంబంధం అనే సంపద్యత జగదాచార్యుల చరిత్రలోనే మనం దర్శించవచ్చు. మచ్చుకగా ముగ్గురు మహానుభావుల మహితను మనం తెలుసుకుందాం!

వడగనంబి అను వారిని ఆంధ్ర పూర్ణులు అని కూడా అంటారు.వీరు పరమపదించినప్పుడు "వడగనంబి వారు తిరునాడుకు వేంచేశారు" అని అంటే అది తప్పుగా భావించారట! "ఆచార్య తిరువడికి వేంచేశారు" అని అనాలని ఆదేశించారట! అప్పటినుండే ఆచార్య తిరువడికి వేంచేశారు అనే మాట వాడుకలోకి వచ్చింది అని పెద్దలు ప్రవచిస్తారు. వడగనంబి వారు అంతటి గురుభక్తి కలవారు. వారికి భగవంతుని మీద కంటే ఆచార్యుల మీద భక్తి ఎక్కువ! మేల్కోట ప్రయాణంలో సాలగ్రామం అనే గ్రామాన్ని చేరుకున్న రామానుజాచార్యులు అక్కడి ప్రజలను ధర్మనిరతులను చేయదలచి ఆ ఊరు చెరువు నీటిని పవిత్రం చేశారట! ఆ విధంగా సాలగ్రామ నివాసి అయిన ఆంధ్ర పూర్ణులు జగదాచార్యులకు శిష్యులైనారు. వీరి గురుభక్తికి నిదర్శనంగా ఎన్నో వృత్తాంతాలు ప్రాచుర్యమైనాయి. భగవద్ దర్శనం కంటే ఆచార్యులకు చేసే క్షీర కైంకర్య సేవ గొప్పదని చెప్పారు. మంత్ర అనుష్ఠానానికి ముందుగా గురుపరంపర ప్రార్థన ప్రాధాన్యాన్ని సూచించారు. తానారాధించు ఆచార్యుల (మిగతా 14 వ పేజీలో)



# శ్రీ నమ్మాళ్వార్ల
# కృష్ణ తృష్ణ



**శ్రీమతి టి.కె. చూడామణి**

**వకుళా భరణం వందే జగదా భరణం శ్రియం**
**యః శ్రుతే రుత్తరం భాగం చక్రే ద్రావిడ భాషయా**

నమ్మాళ్వార్లు శ్రీకృష్ణుని యందు అత్యంత భక్తి గలవారు. సౌలభ్యానికి పరాకాష్ఠ అయిన శ్రీకృష్ణ తత్వమంటే ఆయనకెంత వ్యామోహమో చెప్పలేము. తిరువాయ్ మొజి దివ్య ప్రబంధంలో నల్లనయ్య వైభవాన్ని వర్ణించిన తీరు అత్యద్భుతం. కృష్ణతృష్ణా తత్వమని వారికి చక్కగా సరిపోయే పేరు. శ్రీకృష్ణుని యందున్న తృష్ణ అంటే దాహం ఆ ప్రేమ ఒక రూపు ధరిస్తే నమ్మాళ్వారుగా రూపు దిద్దుకొంటుంది.

యశోదమ్మ కన్నయ్యని రోటికి కట్టిన సందర్భాన్ని తలచుకొంటే చాలు నమ్మాళ్వార్లు దుఃఖంతో ఆరుమాసాలు మూర్ఛపోయారట. అబ్బా అంత వ్యామోహమా! అంటే ఈ పాశురంలో ఆ ఆనందాన్ని ఆస్వాదిద్దాం!

పాశురం 1-3-1

**పత్తుడై యడియవర్ క్కెళియవన్ పిఱరగళుక్కరియ**
**విత్తగన్ మలర్ మగళ్ విరుంబుం నమరుం పెఱలడిగళ్**
**మత్తుఱు కడై వెణ్ణెయ్ కళవినిల్ ఉరవిడై యాప్పుణ్డు**
**ఎత్తిర మురలినోడు ఇణై న్దిరున్దు ఏంగియ వెళివే**

పరమాత్మ సేవించాలని ఆశగలవారికి సులభుడు. ఆ ఆశలేనివారికి దుర్లభుడు. ఈయన్ని లక్ష్మీదేవి ఎంతో ఆశపడుతుంది. అలాంటాయన చిన్ని కృష్ణునిగా ఉన్నప్పుడు తల్లి ఎంతో కష్టపడి తీసిన వెన్నను దొంగిలింపబోయాడు. చూసేసింది తల్లి. చిన్న చిన్న తాళ్లన్నీ ముడివేసి బొజ్జ చుట్టూ తిప్పి రోటికి కట్టేసింది. అంతే ఎంత నటనో! ఎక్కి ఎక్కి ఏడుస్తున్నాడు. ఆ దృశ్యాన్ని నమ్మాళ్వార్లు భావనా బలంతో ప్రత్యక్షీకరించుకొని అయ్యో! పరమాత్మా! అఘటిత ఘటనా సమర్థుడవే. ఎంత సులభుడవయ్యావయ్యా భక్తితో బంధింపబడ్డావా! దామోదరుడ వయ్యావా! ఆహా! ఆ ఏడుపు ఆ ఎక్కిళ్ళు ఎలా భరించగలను. తండ్రీ అంటూ మూర్ఛపోయారు నమ్మాళ్వార్లు. ఈ చేష్టలోని వైభవాన్ని చూద్దాం.

యశోదమ్మ కృష్ణునికి కన్నయ్యకి పాలిస్తోంది. ఇంతలో పొయ్యి మీద పాలు పొంగిపోతున్నాయి. పిల్లాణ్ణి దింపి గబగబా పరుగుపెట్టింది. అంతే కోపం వచ్చింది. నీకు నాకంటే పాలెక్కువా? అంటూ ఒక పెరుగు కుండను పగులగొట్టాడు. వెన్న తీసుకొని తింటూ దొంగ ఏడ్పు మొదలు పెట్టాడు. ఆవిడ వచ్చి చూసేసరికేముంది ! బద్దలైన కుండ, నేల మీద పెరుగు. ఓహో వెన్న ఆరగిస్తున్నావా! అంటూ చూస్తే ఎక్కడ కనిపించడే! ఒక బెత్తం తీసుకొని బయలుదేరింది. కొంచెం దూరంలో కనిపించాడు దొంగ. ఏరా? నిన్నెవరు కొట్టలేరని అనుకుంటున్నావా? భయం లేకుండా ఉన్నావు. ఈ రోజు నిన్ను విడిచేది లేదంటూ ఆగక్కడ! అంటూ దగ్గరకు వచ్చింది. ఈ తూనీగ దొరుకుతుందా ? దూకేస్తు, గజ్జెలు ఘల్లు ఘల్లు మంటూ పరుగుపెట్టాడు. పాపం ఆవిడకి నీరసం వచ్చింది. కొప్పు జారిపోయింది. చెమటలు పట్టాయి. చూస్తున్నాడు కిట్టయ్య. ఆట ఆడించేశాడు.

**"స్తంభాదికంబులు తనకు నడ్డంబైన నట్టట్టుసని పట్టనీనివాని**
**నీ తప్పు సైరింపు మింక దొంగిలి బోవనేనని**
**మునుముట్టఏడ్పువాని**
**కాటుక నెఱయంగ కన్నులు నులుముచు వెడలు**
**కన్నీటితో వెగచువాని**
**నే దెస వచ్చునో యిదియని పలుమారు సురుగుచు**
**క్రీగంట చూచువాని"**

**గూడ పాతి పట్టుకొని వెఱ పించుచు చిన్ని వెన్న దొంగ సిక్కెననుచు నలిగి కొట్ట చేతులాడక పూబోడి కరుణ తోడ బాలు గట్ట దలచి"** అని కన్నయ్య నటన అద్భుతం. స్తంభాలడ్డువస్తే ఎటువస్తుందో తల్లి అని అటు ఇటు తొంగి చూస్తున్నాడు. ఇంకా దగ్గరికి రాకుండానే అమ్మా! అమ్మా! ఈ ఒక్క సారి వదిలెయ్యవే, ఇంకెప్పుడు చెయ్యనే అని దొంగ ఏడ్పు ఒకటి. నీళ్లు రాని కళ్లని నలిపివేసి, కాటుక ఒళ్ళంతా పూసుకొని. అహో ఏమి నటనరా.. దొరికిపోయావు చూడంటూ పట్టేసుకుంది. కొట్టగలదా? చేతులు వస్తాయా? అందుకే రోటికి కట్టివేద్దాం అనుకుంది. తాళ్లేవి, ముక్కల తాళ్లన్నీ ముడివేసింది. బొజ్జ తిరిగి రాదయ్యె, "జగజ్జాలములున్న బొజ్జ కట్టన్ వశమే". దామ (త్రాడు) ఉదారంపై ఉండటంవల్ల దామోదరుడు అయ్యాడు.

(మిగతా 14 వ పేజీలో)

## పురుషోత్తమ క్షేత్రం, పూరీ జగన్నాథం

(5 వ పేజీ తరువాయి) ఇంకో ఆశ్చర్యమయిన అంశం ఏమిటంటే అక్కడ నరసింహస్వామియే జగన్నాథుడుగా పూజలందుకుంటున్నాడు. జగన్నాథుడుగా ఉండే దారు మూర్తిలో నరసింహుని యొక్క సాలగ్రామాన్ని ఆత్మ స్వరూపంగా ఉంచుతారు అనే కథనం కూడా వుంది.

ఇక్కడి ఆచారాలు చాలా ఆశ్చర్యకరంగా అనిపిస్తాయి. కాలంలో ఎంతో పరిణతి ఏర్పడినా జగన్నాథుడికి నివేదన చేసే ప్రతిపదార్థము కట్టెలపైనే వండుతారు. వండిన పదార్థాలన్నింటినీ జగన్నాథుడికి నివేదిస్తారు. అక్కడ చేసే ప్రతిదీ మనుషులు తాము స్వయంగా యంత్రాలు వాడకుండా సమకూరుస్తారు. అక్కడ ఉండే వారందరూ జాతి మత భేదం లేకుండా కలిసి స్వామి యొక్క ప్రసాదాన్ని స్వీకరించాలని ఆచారం. అందుకనే పూరి పురుషోత్తమ క్షేత్రానికి వెళితే ఎంత గొప్ప ఆచారం కలిగిన వారైనా జగన్నాథుని ప్రసాదాన్ని స్వీకరించకుండా ఉంటే అది మహాపాపమని చాలా దోషాలు ఏర్పడతాయని భావిస్తారు.


జగన్నాథుని ఆలయం శిఖరం పైన ఉన్న సుదర్శన చక్రం మనుష్య ప్రమాణంగా ఉంటుంది. ప్రతి నిత్యమూ ఆ చక్రంపైన ఉండే ధ్వజాన్ని మార్చుతారు. పూరి జగన్నాథ్ అనగానే అందరికీ గుర్తొచ్చే జగన్నాథ రథయాత్ర. ప్రతి సంవత్సరం నూతనమైన రథమే ఉపయోగిస్తారు. ఎప్పటికప్పుడు ఆ రథాన్ని మారుస్తూ ఉంటారు. రథానికి వాడిన కర్రలు రథోత్సవం అయిన తర్వాత నిత్యం వాటితో అక్కడ వంట చేసే పద్ధతి వుంది. జగన్నాథుడికి, సుభద్రకు, బలభద్రుడికి కూడా మూడు రథాలు చేస్తారు. జగన్నాథుని రథానికి పేరు నందిఘోషము, బలభద్రుడి రథం తాళ ధ్వజము అని పేరు. జగన్నాథ రథం కొంచెం పెద్దది, దాని కంటే చిన్నది బలభద్రుడి రథం, అంతకంటే కొంచెం చిన్నది సుభద్ర రథం ఇవి మూడు ఊరేగుతాయి అందుకే జగన్నాథ రథచక్రాలకు, జగన్నాథ రథోత్సవానికి ఎంతో గొప్పతనం ఉన్నది. **"రథారూఢో గచ్ఛన్ పథి మిళిత భూ దేవ పటలైః శృతిః ప్రాదుర్భావం ప్రతిపద ముపాకర్ణ్య సదయః దయాసింధుః బంధుః సకల జగతాం సింధుసుతయా జగన్నాథ స్వామి నయన పథగామి భవతుమే"** అంటూ వల్లభాచార్య స్వామివారు ఆ రథోత్సవ సన్నివేశాన్ని ఈ శ్లోకం ద్వారా చెప్పారు. జగన్నాథ స్వామి రథమందు అధిరోహించిన వాడై ఆ మార్గమధ్యలో ఉండే ఎందరో భూదేవతలు అంటే భూసురులు, వేదం చదువుకొనే బ్రాహ్మణులు చేస్తున్న స్తోత్రాలను వింటూ వెళుతుంటాడు. ఎంతో గొప్ప దయాసముద్రుడు అయిన జగన్నాథుడు, సుభద్ర అంటే "సింధు సుత" అనగా లక్ష్మీదేవితో ఊరేగుతాడు. అంటే ఆ సుభద్రనే సింధు సుత లక్ష్మీదేవి అనే పేరుతో వల్లభాచార్య స్వామి వారు పిలుస్తారు. సుభద్ర చెల్లెలు అని కాకుండా జగన్నాథుని భార్య అని చెప్పే పద్ధతి వల్లభాచార్య స్వామి వారి సంప్రదాయంలో కనిపిస్తుంది. శ్రీసంప్రదాయము, చైతన్య సంప్రదాయము, ఒడియా సంప్రదాయం, వల్లభాచార్య సంప్రదాయమని అనేక సంప్రదాయాలతో పాటు శంకర సంప్రదాయం కూడా అక్కడ ఉంది. శంకరాచార్యులవారికి, రామానుజాచార్యుల వారికి, మధ్వాచార్యులకు, చైతన్య సంప్రదాయస్తులకు ఇది ఎంతో ఉపాదేయమైన క్షేత్రము. బ్రాహ్మణేతరులు కాని ఎంగిలి, అంట్లు కాని ఎటువంటి ఆక్షేపణలు ఇక్కడలేవు అందుకే సర్వం జగన్నాథం అంటారు.

**"స్వాత్మానం పృథక్ కృత్య భక్త ప్రేమ వశం గతః అర్చాయాం ఆస్థితోదేవః"** అని పాంచరాత్రాగమంలో బృహత్ సంహిత చెబుతుంది. భగవంతుడు తన దేహమును, తన ఆత్మను, తన స్వరూపాన్ని వేరువేరుగా చేసుకొని శ్రీరంగంలో, తిరుమలలో, కాంచీపురంలో, తిరునారాయణపురంలో, పూరి క్షేత్రంలో, బదరికాశ్రమంలో, నైమిశారణ్యలో ఉన్నాడు. ఇలా భగవంతుడు భక్తుల ప్రేమకు వశుడై వాళ్ళు కోరిన రూపాలు ధరించి అనుగ్రహిస్తూ ఉంటాడు అని బృహత్ సంహిత చెబుతుంది. దీనిని స్వీకరించిన శ్రీవైష్ణవ సంప్రదాయంలో కూడా భగవంతుడు వేరువేరు రూపములలో కనిపించినప్పటికి ఒక్కడే అని భావిస్తారు. భగవంతుడు ఒక్కొక్కచోట ఒక్కొక్క రకమైన ఉపచారాన్ని స్వీకరిస్తూ ఉన్నాడు. స్వామి అన్నిచోట్ల పూజలన్నీ స్వీకరించి శ్రీరంగానికి వెళ్లి పవళించి నిద్రిస్తాడట. అక్కడ నిద్ర పోయిన స్వామి తిరుమలలో వెంకటేశ్వరుడుగా సుప్రభాతాన్ని స్వీకరిస్తాడు. సాలగ్రామ క్షేత్రానికి వెళ్లి ముక్తినాథ క్షేత్రంలో స్నానం చేస్తాడట. అనుష్ఠానానికి బదరికాశ్రమం వెళ్ళి అష్టాక్షరీ జపం చేస్తాడు. అలంకారం చేసుకోవడానికి సింహాచలంకు వచ్చి చందన అలంకారంలో భూషితుడై ఆనందిస్తాడు. పూరి జగనాథానికి వచ్చి ఆ పురుషోత్తమ క్షేత్రంలో చక్కగా భోజనం ఆరగిస్తాడట. భద్రాచలం వచ్చి కల్యాణోత్సవాన్ని చేసుకొంటాడట. విశ్రాంతి తీసుకోవడానికి మరల శ్రీరంగానికి వెళతాడట. ఒక్కొక్కచోట ఒక్కొక్క అర్చామూర్తిగా ఉండి ఆయా ఉపచారాలు స్వీకరిస్తాడు. ఈ సందర్భంగా జగన్నాథ రథోత్సవానికి, ఈ క్షేత్రంలో ఆరగింపు జరిగిన పదార్థానికి ఎంతో గొప్పతనమున్నది. ఇటువంటి అనేక ఆశ్చర్యములకు నెలవు పురుషోత్తమ క్షేత్రమైన పూరి జగన్నాథ క్షేత్రం. పూరి జగన్నాథ క్షేత్రంలో ఉన్న స్వామికి జరిగే సేవలో జగన్నాథ రథయాత్ర ప్రసిద్ధమైనది. ఆ జగన్నాథ యాత్రను చక్కగా సేవించి మనమంతా తరిద్దాం! ఆ పూరి జగన్నాథుని యొక్క అనుగ్రహానికి పాత్రులమవుదాం.

★

# శ్రీపతి స్తుతి

# సుభాషితం
## మంచి మాట



ప్రాతర్నిత్యాను సంధానంలో **'కృష్ణాష్టకం'** ప్రధానమైనది. 'కృష్ణాష్టకం' అంటే శ్రీకృష్ణునిపై నమస్కార పూర్వకంగా నున్న 8 శ్లోకముల సముదాయము. ఇందులో ప్రతి శ్లోకం చివరి పాదము "కృష్ణం వందే జగద్గురుమ్" అని ఉంటుంది. దీనికి మకుటం అని పేరు. జగత్తునకు గురువైన కృష్ణుని గురించి నమస్కరిస్తున్నాను అని అర్థము.

భగవంతుడు మనలను ఉద్ధరించుటకై ఎన్నో అవతారాలను అనుగ్రహించినాడు. అన్ని అవతారాలకంటే కృష్ణావతారం చాలా విశిష్టమైనది

**అవతారాః సంత్య న్యే సరసిజ నయనస్య సర్వతో భద్రాః**
**కృష్ణాదన్యః కోవా ప్రభవతి గో గోప గోపికా ముక్త్యై ?**

తాత్పర్యం :- పద్మపత్రం వంటి నేత్ర సౌందర్యం గలిగిన శ్రీమన్నారాయణుని 'అందరకు, అంతట, ఎల్లప్పుడు' మంగళములను కలిగించే అవతారములు ఇతరములు ఉన్నవి. కాని అమాయకమైన గోవులకు, గోవులను కాసే గోపాలకులకు, ముగ్ధ మనోహరులైన గోపికలకు అందరికీ ముక్తిని కలిగించుటకై కృష్ణునికంటె వేరెవరు సమర్థుడు కాగలడు? అనగా ఇంత సులభంగా అందని ముక్తిని ఇవ్వగలిగినది శ్రీకృష్ణుడు మాత్రమే. మరెవ్వరికి ఇట్టి సామర్థ్యము లేదు. కృష్ణుని అవతార విషయము, ప్రయోజనము, ప్రాముఖ్యము తెలుపాలంటే పెద్ద గ్రంథమే అవుతుంది. మనకంత ఓపిక లేదు, సమయంలేదు. ఆ విషయాలు మరొకసారి తెలుసుకుందాము. ప్రస్తుతం కావలసినది కృష్ణాష్టక అర్థ తాత్పర్యములు గదా!

1. శ్లో॥ **వసుదేవ సుతం దేవం, కంస చాణూర మర్దనమ్**
**దేవకీ పరమానందం, కృష్ణం వందే జగద్గురుమ్**

ప్రతి పదార్థము :- వసుదేవ సుతం = వసుదేవుని పుత్రుడైన, దేవం= పరమ పదము, ప్రకృతి మండలము ఈ రెండింటితో క్రీడించుచున్న, కంస చాణూర మర్దనం = కంసుని, చాణూరుడు అనే ముష్టియుద్ధ నిపుణుడైన మల్లుని చంపినట్టి, దేవకీ పరమానందం = దేవకీ దేవికి పరమానందమును కలుగజేసినట్టి, జగద్గురుమ్ = జగత్తునకంతటికి ఆచార్యుడైనట్టి, కృష్ణమ్ = శ్రీకృష్ణుని, వందే = నమస్కరించు చున్నాను

**శ్రీమాన్ శ్రీ అమరవాది వేంకటనరసింహాచార్యులు**

తాత్పర్యము - శ్రీకృష్ణుని కన్న తల్లిదండ్రులు దేవకీ వసుదేవులు. భగవత్ తత్వము వసుదేవునిలో ప్రవేశించి, దేవకీ గర్భంలో జేరి పుత్రుడుగా రూపు దాల్చినది. మిగతా అవతారాలు అంటే కృష్ణునకు పూర్వమున్నవి ఈ విధంగా వచ్చినవి కావు. అవన్నింటిలో కొన్ని అంశావాతారాలు, ఆవేశావతారాలు. అనగా ఆయా శరీరాలతో కొన్ని తాత్కాలికమైన ప్రయోజనాల కొరకై వచ్చినవి.

ఉదా:- మత్స్య, కూర్మ, వరాహాదులు, మరికొన్ని ఆవేశావతారాలు. ఉదా:- పరశురాముడు వంటివి. ఇక నారసింహావతారము రెండు రూపాల కలయిక. కంఠం వరకు మనవాకారము ముఖము సింహాకారము. అట్లు కాకుండా పూర్తిగా మనవాకారంలో వచ్చి, మానవ ధర్మాలను నిరూపించి (ఆచరణ ద్వారా) లోకరంజకంగా రాజ్యం పాలించిన ఆదర్శమూర్తి శ్రీరామ అవతారము పూర్ణావతారము. ఇక శ్రీకృష్ణావతారము పరిపూర్ణావతారము. ఇటు మానవుడుగా, అటు భగవానుడుగా రెండు పాత్రలను పోషించిన మహానుభావుడు. అంతేగాదు అర్జునుడు నెపంగా 18 అధ్యాయముల భగవద్గీతను లోకానికందించి, జగద్గురువుగా ఖ్యాతి నందిన వాడు. రామ-కృష్ణ అవతారములలో రాముడు తనను తాను మానవుడుగా చెప్పుకుంటే, శ్రీకృష్ణుడు పుట్టగానే శంఖ, చక్రాలతో భగవత్ స్వరూపాన్ని కంసుని చెరసాలలోనే తల్లిదండ్రులకు చూపించినాడు. అందుకే 'తమద్భుతం బాలక మంబు జేక్షణం, చతుర్భుజం శంఖ గదాద్యుధాయుధం' అని భగవానుని వ్యాస భగవానుడు కీర్తించినాడు. మఱొక విశేషం ఏమంటే రాముడు పాయస భక్షణ ద్వారా కౌసల్యా గర్భంలో ప్రవేశించాడు. కానీ కృష్ణుడు వసుదేవునిలో తేజోరూపంగా ప్రవేశించి, ఆయన ద్వారా దేవకీ గర్భంలో చేరి జన్మించాడు.

*మరికొన్ని రామావతార విశేషాలు వచ్చే సంచికలో.* ★

భగవత్ గుణానుభవం

# భక్తిమాధుర్యం

గుండు మహాలక్ష్మీ రాణి



విష్టాద్వైత సిద్ధాంతమనీ, శ్రీవైష్ణవ సాంప్రదాయమని అనేకంగా పిలుచుకునే మన సాంప్రదాయంలో ఆళ్వార్లకు, ఆచార్యులకూ వారు పాడిన ప్రబంధాలకూ ఒక విశిష్ట స్థానం కలదు. వీరు పన్నిద్దరూ పాడిన పాటలే నాలాయిరదివ్య ప్రబంధం.

"భూతం సరశ్చ మహాదాహ్వయ భట్టనాథ శ్రీ భక్తిసార కులశేఖర యోగి వాహాన్। భక్తాంఘ్రి రేణు పరకాల యతీన్ద్ర మిశ్రాన్ శ్రీమత్పరాంకుశ మునిం ప్రణతోస్మి నిత్యమ్॥" పై శ్లోకంలో ఉన్న 11 మంది ఆళ్వార్లు, గోష్టిలో గోదమ్మను చేర్చి 12 మందిగా ద్వాదశ సూరులు అంటాం.

ఈ ద్వాదశ సూరులలో నమ్మాళ్వార్లు ప్రాణభూతులు అయితే వారి తరువాత తిరుమంగై ఆళ్వారులే లెక్కకు రాతగిన వారు. వీరి కవిత కూడా నమ్మాళ్వార్ల కవితవలె అర్థ గాంభీర్యము, భావ మాధురీ సంపద కలిగినది. లెక్కలో కూడా వీరి పాశురముల సంఖ్య అధికమే!... అందుచేతనే వీరికి చతుష్కవి శిఖామణి అని పేరు కలిగినది.

నమ్మాళ్వారు తిరువాయ్ మొజి లో నాయకాభావం అనుభవించి భగవద్ విరహమును ప్రవహింపచేసినట్టే తిరుమంగై ఆళ్వార్లు కూడా పెరియతిరుమొజిలో నాయికా భావాన్ని వర్ణిస్తారు.

నమ్మాళ్వారు చతుర్వేద సారముగా నాలుగు ప్రబంధాలు అనుగ్రహించారు. 1. తిరువిరుత్తము - ఋగ్వేదసారము. 2 తిరువాశిరియం - యజుర్వేద సారముగా. 3 పెరియ తిరువందాది - అధర్వణ వేదసారముగా 4 తిరువాయ్ మొజి - సామ వేదసారముగా (చరమ ప్రబంధమని, మోక్షప్రబంధము) 5. తిరుమంగై ఆళ్వారు - నమ్మాళ్వారు చతుర్వేదసారముగా అనుగ్రహించిన నాలుగు ప్రబంధాలకు అంగములుగా ఆ ప్రబంధాలను తిరుమంగై ఆళ్వార్లు అనుగ్రహించారు. 6) పెరియ తిరుమొజి 1) పెరియ తిరుమడల్, 2) శిరియ తిరుమడల్ 3) తిరుక్కురుందాంజగం 4) తిరునెడుందాందగం 5) తిరువెజి కూృత్తిరుక్కై అనేవి. తిరుమంగై ఆళ్వారు అనుగ్రహించిన పైన యిచ్చిన ప్రబంధాలలో ఒకటి తిరువెజికూృత్తిరుక్కై అనే ప్రబంధం.

దీని యొక్క సారము ఏమంటే "శరణాగతి చెయ్యడమే చేతనులకుఉజ్జీవనం" అని తెలియ చేశారు. ఈదివ్యప్రబంధంలో తిరుమంగై మన్నన కుంభ కోణం దివ్య దేశంలోని శారంగపాణి పెరుమాళ్ విషయంలో శరణాగతి చేస్తూ స్వామిని ఏడు చేష్టలను తెలియ చేస్తూ మధురంగా ప్రార్థించారు.

1) సృష్టికి ముందు నీనాభి కమలం నుండి బ్రహ్మ గారిని సృష్టించావు, అలాగే మమ్ముకుండా బ్రహ్మ గారిచే సృష్టింపచేశావు, సృష్టించి పుట్టించిన వాడవు, రక్షించవద్దా! అంటూ స్వామిని నిలదీస్తున్నారు.

2) ఆ శ్రియ:పతివైన నీవే సామాన్యమైన మానవుడుగా, రాముడుగా అవతరించి, కృషీవలుడు కలువుతీసినట్లుగా , రాక్షస సంహారం చేసి, లోకాలను రక్షించేందుకు శరవర్షం కురిపించావు. అలాగే సీతమ్మను రక్షించావు. మరి నాలోని కామ క్రోధ, లోభ, మోహ, మద మాత్సర్యాలు అనేవి తొలగించ వద్దా స్వామీ, తొలగించి నన్ను రక్షించవద్దా అంటున్నారు తిరుమంగై మన్నన్.

3. పొట్టి బ్రహ్మ చారివై "మావలి మూవడి తా" అంటూ బలిని యాచించి, శంఖం, చక్రం, గద, శార్ఙ్గము, కల్పవృక్షం మొదలైన మంగళకర చిహ్నాలు కల నీ పాద కమలమును, లోకమంతటా స్పృశింపచేసి, త్రివిక్రముడుగా, అనుగ్రహించావే మరి! ఆర్తిగల నాపై నీపాదాన్ని ఉంచలేవా స్వామి అంటున్నారు తిరుమంగై మన్నన్.

4. తిర్యక్ ఐన గజేంద్రుని రక్షించావే, ఒక మునలి బారి నుండి రక్షించావు కదా. పంచేంద్రియాలనే ఐదు మొసళ్ళ చేతపీడింపబడే నన్నెపుడు రక్షిస్తావు? అని ప్రార్థిస్తున్నారు.

5) వరాహరూపివై హిరణ్యాక్షుని సంహరించి నీటి నుండి భూదేవిని రక్షించి, నీదంతాలపై ఉంచుకొని ఆప్యాయంగా, పైకి తెచ్చావే, మరి ఈ సంసార సముద్రంలో మునిగిన నన్ను పైకి లేపి నీ పాదాల చెంత ఎపుడు చేర్చుకుంటావు అని అంటున్నారు.

6). కణ్ణ పిరాన్ గా ఏడెద్దులను సంహరించి, నీళాదేవి చేత వరింప బడ్డావు. మరి నా విరోధులను తొలగించి నన్నెప్పుడు వరిస్తావు అంటూ నిలదిస్తున్నారు.

7). వటదళ శయనుడై ప్రళయ కాలంలోలేత మఱ్ఱియాకు పై పవళించి సకల చేతనాచేతనులనూ, నీలో ఉంచుకుని రక్షించిన వాడవు, నన్ను రక్షించుట నీకు దుర్లభమా అంటూ స్వామి యొక్క చేష్టితాలను గుర్తు చేస్తూ తనను రక్షించమని, శరణాగతిచేశారు తిరుమంగై ఆళ్వార్లు.

పరాత్పరుడు అయిన ఆ పరమాత్మ, దయాగుణం కలవాడని అఘటన ఘటనా సామర్థ్యం కలవాడని తెలియచేస్తు మనఆళ్వార్లు భగవత్ గుణానుభవంతో, భక్తి మాధుర్యంతో పరమాత్మను కీర్తించారు.

# భాగవతంలో భగవంతుని అవతార గాథలు



శ్రీమతి తిరుమల నీరజ

(క్రిందటి సంచిక తరువాయి)

బ్రహ్మదేవుడు తన మానసపుత్రుడైన నారదమహర్షితో ఇంకా ఇట్లా చెబుతున్నాడు.

"ఓ నారదా! ఆ పైన బుద్ధావతారాన్ని గురించి విను. చపల చిత్తులు, అసత్యభాషణులు, వేదాచారాలను వక్రీకరించేవారు, పేట్రేగిన పాషండమతస్థులు, దైవధర్మాల పట్ల అవిశ్వాసంతో అనుచితమార్గం పట్టేవారు, లోకులను చంపేవారు, దైత్యులు ఐన దానవుల ప్రవర్తన వల్ల లోక మంతా అధర్మంతో నిండి పోతుంది. ఆయా దురాచారాలను తుడిచి పెట్టేందుకు శ్రీమహావిష్ణువు బుద్ధుడుగా అవతరించి, వారందరినీ తుద ముట్టిస్తాడు.



"ఆ పైని అవతారం కల్కి అవతారం. కలియుగంలో ఆ పరాత్పరుణ్ని బ్రాహ్మణులు స్తుతించరు. యాగాలకు సంబంధించిన మహావాక్యాలు పలుకరు. నిజం చెప్పనే చెప్పరు. వారిలో దైవభావం, ధర్మచింతన సన్నగిల్లిపోతాయి. శూద్రులు పాలకులవుతారు. ఇవి కలికాలంలో జరిగినపుడు స్వామి కల్కిగా అవతరిస్తాడు. ఈ లోకంలోని అధర్మాన్ని పారద్రోలు తాడు. ధర్మాన్ని నిలబెట్టి లోకాలను కాపాడుతాడు" అని చెప్పాడు బ్రహ్మదేవుడు. అంతటితో ఊరుకోకుండా ఇంకా ఈ విధంగా చెబుతున్నాడు – "ఓ నారదమహర్షీ! విష్ణువు తాల్చిన లీలావతారకథల సంగతి యావత్తూ నేను నీకు తెలియచెప్పటానికి ముందుగానే శ్రీహరి ఆయా అవతారాలను ధరించాడు. వరాహ అవతారం మొదలైనవి వేర్వేరు మన్వంతరాలకు చెందిన అవతారాలలో నెరవేర్చినవీ ఉన్నాయి, నెరవేర్చబోయేవీ ఉన్నాయి.

"ఇప్పుడు ఆ ప్రభువు ధన్వంతరి అవతారాన్నీ, పరశురామ అవతారాన్నీ పొంది ఉన్నాడు. రాబోయే కాలంలో శ్రీరామాది అవతారాలు పొందుతాడు. ఆ పరమాత్మ సర్గ మొదలైన విభిన్నకార్యాల కొరకు మాయాగుణాలతో నిండిపోయిన అవతారాలూ ఎత్తుతుంటాడు. ఎన్నో శక్తులను స్థిరంగా నిలుపుకొనే ఆ భగవానుడు, సృష్టి ప్రారంభంలో తపస్సుగా, నేనుగా, ఋషులుగా, తొమ్మండుగురు ప్రజాపతులుగా అవతరించి లోకాలను పుట్టిస్తూ ఉంటాడు. ధర్మం, విష్ణువు, యాగాలు, మనువులు, ఇంద్రుడు మొద లైన దేవతలు రాజులు తదితరులుగా అవతరించి ప్రపంచస్థితిని కల్పిస్తూ ఉంటాడు. అధర్మంగా, రుద్రుడుగా, మహాసర్పాలుగా, రాక్షసులుగా రూపు లెత్తి ప్రళయం పొందిస్తూ ఉంటాడు.

"ఈ విధంగా ఆ పరమాత్ముడూ, సర్వాత్మకుడూ ఐన విష్ణువు ఈ ప్రపంచపు సృష్టి స్థితి ప్రళయాలకు కారణభూతుడై ప్రకాశిస్తూ ఉంటాడు. నేల మీది ధూళికణాల నైనా లెక్కించవచ్చేమో కానీ, ఆ మహాత్ముని లీలావతారాల అద్భుతగాథలను ఎవ్వరూ లెక్కించలేరు."

ఇక మనం ఆయా అవతారాల వివరాలు, సందర్భాలు, ఆయా రాక్షసులకు ఏ విధంగా శ్రీమన్నారాయణుడు ముక్తిని ప్రసాదించాడు అనే విషయాలను విశదంగా తెలుసుకొందాము.


శ్రీమద్భాగవతంలో మొట్టమొదట వర్ణించినది యజ్ఞవరాహ అవతారాన్ని. ఆ అవతారం ఏర్పడిన సందర్భం కూడా చాలా చిత్రంగానే ఉంటుంది.

మహాభారత యుద్ధం తర్వాత, విదురుడు తీర్థయాత్రలకు బయలుదేరాడు. దారిలో మైత్రేయమహర్షి కనిపించి, విదురుని కోరిక మేరకు సృష్టి రహస్య మంతా చెప్పటం ప్రారంభిస్తాడు. బ్రహ్మదేవుని కుమారులలో ఒకడైన స్వాయంభువ మనువు సృష్టికి తొట్టతొలి చక్రవర్తి. అతన్ని ప్రజాభివృద్ధి చేయమని బ్రహ్మ ఆజ్ఞాపించాడు. స్వాయంభువుడు తనకు, తన సంతానానికీ నివసించదగిన చోటు చూపమని బ్రహ్మను అడిగాడు. ఎందుకంటే, సృష్టిలోని సమస్త జంతుజాలానికీ ఆధారభూత మైన భూమి అప్పుడు సముద్రంలో మునిగిపోయి ఉంది. అప్పుడు బ్రహ్మదేవుడు తన మనసులో అన్ని భూతాల లోను అంతర్యామి స్వరూపంగా ఉన్న పురుషోత్తముణ్ని (మిగతా 12 వ పేజీలో)



సాంప్రదాయ ధురీణులు

# శ్రీమాన్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యులు



సాంప్రదాయ సౌధ వైభవాన్ని దశాబ్దాలుగా మూల స్తంభాల వలె నిలచి కాపాడిన వారిలో ముఖ్యులు శ్రీమాన్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్యస్వామి వారు. శతాబ్దాలుగా సత్ సాంప్రదాయ విస్తృతి కొనసాగేలా శిష్య పరంపరను వారు తయారు చేశారు. ఎందరికో జ్ఞాన జన్మనిచ్చిన మహర్షులు కీర్తి మూర్తులు. 90 సంవత్సరాల వారి జీవితంలో వారు చేసిన సాంప్రదాయ సేవ సామాన్యులకు సాధ్యమయ్యేది కాదు. వారి జ్ఞాన స్ఫూర్తి శాశ్వతమయ్యేలా శతాధిక గ్రంథాలను రచించారు. ఆ గ్రంథ సంపద తరాల వరకు ప్రవచన కారులకు జిజ్ఞాసువులకు కరదీపికలుగా, మార్గదర్శకాలుగా నిలిచి ఉంటాయి. వారు రచించిన విష్ణుసహస్ర నామ భాష్య గ్రంథం విశేషమయినది. వృత్తిలో ప్రవృత్తిలోనూ వారు ఆచార్య వర్యులు. పరమహంస పరివ్రాజకాచార్యులైన జీయర్ స్వాములకు వారు గురువులు. శ్రీ వైష్ణవ సాంప్రదాయ ప్రచారాన్ని మాత్రమే కాకుండా జీర్ణ దేవాలయ ఉద్ధరణను ప్రారంభించి దేవాలయాల పున:ప్రతిష్ఠలు గావించారు. జ్ఞాన విస్తరణకు సత్సాంప్రదాయ పరిరక్షణ సభ, సంస్కృత విజ్ఞాన వర్ధిని పరిషత్, శ్రీపాంచరాత్రాగమ పాఠశాల ఇత్యాదులు స్థాపించారు. భగవత్ కైంకర్య నిధి పేరుతో ధార్మిక సంస్థను నెలకొల్పారు. గ్రంథ రచనలు, గ్రంథ ప్రచురణలు కొనసాగించారు. సాంప్రదాయ ఆచరణ విషయాలలో ఎన్నో సందేహాలను నివృత్తి గావించిన జ్ఞానఖని వారు. 1926 మే నెల ఒకటవ తేదీన కృష్ణాజిల్లా గుడివాడలోని మోటూరు అనే గ్రామంలో వారు జన్మించారు. తల్లి శేషమ్మ తండ్రి సీతారామచార్యులు. సంస్కృత భాష, దివ్య ప్రబంధాలు, శ్రీభాష్యాది శాస్త్రాలు, వేద వేదాంగాలు అభ్యసించి వృత్తిరీత్యా వరంగల్లో స్థిరపడ్డారు. వరంగల్ సింహాద్రిబాగులో వైదిక కళాశాలలో ప్రధానాచార్యులుగా, విశ్వేశ్వర సంస్కృతాంధ్ర కళాశాలలో ఉపన్యాసకులుగా 40 సంవత్సరాలు వృత్తిని కొనసాగించారు. శబ్దార్థ విషయాలలో పాండిత్య నిరూపణం చేసి "శబ్దార్థకేసరి" అనే బిరుదును పొందారు. పెద్ద జీయర్ స్వామి వారి చేతుల మీదుగా ఉభయ వేదాంత పండితులనే బిరుదును స్వీకరించారు. భారత రాష్ట్రపతి వి.వి. గిరి చేతుల మీదుగా రాష్ట్రపతి పురస్కారం, టీటీడీ విశ్వవిద్యాలయం నుండి మహా మహోపాధ్యాయ పురస్కారం, కవి శాస్త్ర కేసరి మరియు గౌరవ డాక్టరేట్, గోపాలోపాయనం, గోపాలదేశిక ఈ విధంగా ఎన్నో పురస్కారాలు అందుకున్నారు. గజారోహణం, కనకాభిషేకం, తులాభార స్వర్ణ కంకణ అశ్వారోహణ గౌరవాలు అందుకున్నారు. శ్రీవైష్ణవ సంప్రదాయ ప్రచారానికి పట్టం కట్టారు. సంప్రదాయ సేవలో సత్యనిరూపణలోను, నిబద్ధతలోనూ వారు అనుసరించిన తీరు అనన్య సామాన్యమైనది. మహర్షి తుల్యులైన శ్రీమాన్ శ్రీరఘునాథ చార్యుల వారి 98వ తిరునక్షత్రోత్సవాన్ని పురస్కరించుకొని సాంప్రదాయ సేవానురక్తితో, భక్తితో శ్రీమాన్ శ్రీ నల్లాన్ చక్రవర్తుల రఘునాథాచార్య స్వామి వారికి శ్రీ సన్నిధానం పత్రిక వందనం సమర్పించుకుంటున్నది.




## భాగవతంలో భగవంతుని అవతారగాథలు

(11 వ పేజీ తరువాయి) లక్ష్మీపతిని తీవ్రంగా భావించాడు. బ్రహ్మ ముక్కు రంధ్రాల నుండి యజ్ఞవరాహమూర్తి బొటన వేలంత దేహంతో జన్మించి ఆకాశానికి ఎగిరాడు. క్షణంలో అక్కడున్న జనులందరికీ ఆశ్చర్యం కలిగిస్తూ అద్భుతంగా ఘనమైన ఏనుగంత అయ్యాడు. ప్రజాపతులు, మునులు, మనువు, మనువు కుమారులు అందరూ ఆ యజ్ఞవరాహాన్ని చూసి విస్మితులయ్యారు. తన ప్రభావాన్ని ప్రదర్శిస్తూ ఆ యజ్ఞవరాహస్వామి రసాతలం లోనికి ప్రవేశించి అక్కడ భూమిని చూశాడు. ఆ పారావారంలో దాగి ఉన్న ఘోరరాక్షసు డొకడు స్వామిని చూసి యుద్ధానికి దిగాడు. ఆ రక్కసుణ్ణి మదపుటేనుగును సింహం చంపినట్లుగా ఉగ్రమైన తన కోరలతో స్వామి వధించాడు. భూమండలాన్ని తన కోర చివర పెట్టుకొని జలరాశి నుంచి బయటికి వచ్చాడు. బ్రహ్మాదిదేవతలు ఆ యజ్ఞవరాహమూర్తిని వేనోళ్ల కొనియాడారు. తన పని ముగిసిన వెనుక స్వామి ఆ అవతారాన్ని చాలించాడు.

ఇంతకూ ఆ రాక్షసుడు ఎవడు? అతనికీ, పరమాత్మకూ ఉన్న వైరానికి కారణ మేమిటి? భూమి రసాతలంలో ఏ విధంగా పడిపోయింది? ఇవన్నీ అందరికీ మనసులో మెదిలే ప్రశ్నలే. వాటన్నిటికీ సమాధానాలు చెప్పుకొంటేనే పూర్తి కథ తెలుస్తుంది.

(సశేషం)

# జ్యోతిర్విజ్ఞానమ్



## శ్రీమాన్ శ్రీ నంబి వేణు గోపాలాచార్య కౌశిక

శ్రీసన్నిధానం పాఠకులు మీ జ్యోతిష్య శాస్త్ర సందేహాలను ప్రశ్నగా మాకు పంపండి, పరిష్కారాలను పొందండి! ఈ విజ్ఞానామృతాన్ని మీరూ ఆస్వాదించండి!!

**(గత సంచిక తరువాయి) స్థానబలం**

పంటలే కావచ్చు అట్లాగే అక్కడ సంచరించే గో ధనమే కావచ్చు. కొన్ని చోట్ల గోవులు విశేషమైన పాలను ఇస్తూ ఉంటాయి. మరి కొన్ని చోట్ల అద్భుతమైనటువంటి స్థాయిలో గోవులు బాగా పెరుగుతూ ఉంటాయి. మరి కొన్ని చోట్ల సాధారణంగా ఉంటుంది. కారణం ఏమిటంటే స్థాన బలం అంటారు. ఆశ్రమాలే కావచ్చు, ఆలయాలే కావచ్చు స్థానం చాలా గొప్పదైతే దాని ప్రభావం తప్పకుండా వుంటుంది. ఉదాహరణకు మనకు భగవద్రామానుజుల వారు వారి ఆచార్యుల దగ్గర అతి కష్టపడి సేవలు చేసి, వారు ఎక్కడికి రమ్మంటే అక్కడికి వెళ్లి, అనుసరించి మంత్ర సాధన చేసుకోవడానికి, మంత్రోపదేశం పొందినారు. సాధన ఏమిటి అంటే నాలాగా ఇంకొకళ్ళు ఈ ఆచార్యుల వెంట తిరగలేరు. అందరికీ అంతటి ఓపికా, తీరికా ఉండక పోవచ్చు. కనుక అందరికీ కావలసిన అద్భుత మంత్రాన్ని అనాయాసంగా, సునాయాసంగా అందించాలనే సంకల్పం కలిగింది. గోష్ఠి పురంలో ఉండే గోపురము ఎక్కి దానిని అందించారు. అందరికి తెలిసిందే ఇది. ఆ ప్రాంతమంతా కూడా పవిత్రమైనది. దాన్ని మంత్ర స్థానము అని పిలుస్తుంటారు.

గోపురాన్ని ఎక్కి ఉపదేశించిన నాటి నుంచి ఈనాటి వరకు వంశపరంపరగా ఎన్ని లక్షల జనమైతే పుట్టినారో వాళ్ళందరూ తరించేలాగా శ్రీమదష్టాక్షరీ మహామంత్రాన్ని ఇవ్వాలని సంకల్పం వారికి కలిగింది. అందరికి ఉపదేశం చేయడం లో కూడా ఆ స్థానం అంత గొప్పది అని చెప్పుకోవచ్చు. అట్లాగే ఆదిశంకరులవారు అనేక ప్రాంతాలు తిరుగుతూ ఆశ్రమ నిర్మాణం చేయాలనుకున్నారు. దాదాపు కొన్ని సంవత్సరాలు శిష్య పరంపరగా చాలామంది శిష్యులను వెంట పెట్టుకొని అనేక ప్రాంతాలు సంచరిస్తూ చివరకు శృంగగిరి అనే ప్రాంతానికి వచ్చారు. తుంగా నదిలో మధ్యాహ్నం పూట మంచి ఎండాకాలంలో సంధ్యావందనం చేసుకుంటున్న సమయంలో శిష్యులందరు ఇలా అనుకొంటున్నారు... మన గురువు గారి వెంట తిరిగి తిరిగి కాలం గడుస్తోంది తప్ప ఆశ్రమానికి అద్భుతమైనటువంటి ఒక ప్రాంతం మనకు లభించడంలేదు, స్థలం లభించడం లేదు. స్థలం లభించడం ఎన్నడు? ఆశ్రమ నిర్మాణం ఎన్నడు? అందులో గురువుగారిని సేవించడం ఎన్నడు? అని వాళ్ళు అనుకుంటున్నారు. ఆదిశంకరులవారు సూర్య భగవానునకు అర్ఘ్యప్రదానం చేస్తూ వారి ప్రధాన శిష్యులకు మనకు దివ్యమైనటువంటి ఆశ్రమ నిర్మాణానికి స్థలం లభించింది అని చెప్పారట! దానికి వారు స్వామి! ఈ కొండ ప్రాంతాల్లో అలాంటి పరిస్థితి లేదుగా అనిపిస్తోంది మాకు, మరి మీరు ఎట్లా నిర్ణయించారు అంటే అటు చూడండి! అని చెప్పి చూపించారు శంకరాచార్య స్వామి వారు. అక్కడ సన్నివేశం ఏం జరుగుతోంది అంటే ఒక కప్ప గుడ్లు పెడుతుంది. మంచి ఎండాకాలం. పాపం అది వేడిని తట్టుకోలేని పరిస్థితి ఉంది. అదే సందర్భంలో ఆ కప్పకు నీడగా ఒక పాము పడగ విప్పి పెట్టిందట. కరుణారస ప్రధానమైన స్థలం ఇది. అద్భుతమైన స్థలంలో దివ్యమైన ఆశ్రమాన్నే నిర్మాణం చేసుకోవాలని నిర్ణయించారు ఆనాడు ఆచార్యులు శంకర భగవత్పాదాచార్య స్వామి వారు. స్థాన ప్రభావం అద్భుతమైనది అని ఈ ఇతిహాసం ద్వారా మనకు తెలుస్తుంది. చరిత్ర చెప్తోంది.

అట్లాగే ప్రతాప గజపతి కాలంలో విద్యారణ్య స్వామి వారిని నూతనమైన రాజ్యాన్ని ఏర్పాటు చేయడానికి, కోట నిర్మాణం చేయడానికి పిలిచారు. విద్యారణ్యస్వామి వారు వేంచేసిన తర్వాత నూతనమైన రాజ్యాన్ని నిర్మాణంచెయ్యాలనుకొంటున్నాము. మా రాజ్యంలో ప్రజలు ఒక వెయ్యి సంవత్సరాల వరకు బంగారు పళ్లెంలో అన్నం తినాలి, బంగారు గ్లాసుల నీళ్ల తాగాలి, సుఖ సంపద సంతోషాలతో కాలం గడవాలి. అటువంటి రాజ్య నిర్మాణం చేయాలి అని కోరాడు. అంటే దానికి ఈ అంశాలు అవసరము. ఒకటి స్థలం. రెండవది ముహూర్తము. మూడవది దైవబలము. (విద్యారణ్య స్వామి ముహూర్తము నిర్ణయించి స్థల పరిశీలన ప్రారంభించారు. **(మిగతా వచ్చే సంచికలో...)**

# శ్రీనమ్మాళ్వార్ల కృష్ణ తృష్ణ

(7 వ పేజీ తరువాయి) చూశావా ఎలా పట్టుకున్నానో అంటోందావిడ. పాపం ఆవిడకేం తెలుసు. కట్టుణ్ణ పణ్ణియ పెరుమాయన్. అమ్మ శ్రమ చూడలేక తన బొజ్జని లోపలికి లాగి కట్టించుకొన్నాడట. ఆవిడేమో తానే కట్టేశాననుకొంటుంది. స్వామి నిన్ను బంధించాలని అనుకొన్న దుర్యోధనాదులను నశింప చేశావు. నిన్ను ప్రేమతో కట్టిన తల్లికి నీ సౌలభ్యాన్ని చూపించి మురిపించావు. ఆహా అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడవే, పరాత్పరుడవే అమ్మ చేత కట్టబడ్డావా ? అది త్రాడు కాదయ్యా ప్రేమ అంటారు కూరేశులు. ప్రేమ త్రాడుగా మారితే అమ్మకి వశుడై కట్టబడ్డాడు. ఏమి సౌలభ్యం. నమ్మాళ్వార్లు "ఎత్తిరమ్ ఎత్తిరమ్" అంటూ ఆశ్చర్యంలో మునిగి ఆ సౌలభ్యానికి పరవశించి మూర్చిల్లారు.

భగవంతుని లీలలు ఎంత సమ్మోహనకరాలు, పోతన గారంటారు. "చిక్కడు సిరి కౌగిటిలో చిక్కడు సనకాదియోగి చిత్తాబ్జములం చిక్కడు శృతి లతికావళి చిక్కెనతడు లీల తల్లి చేతన్ రోలన్ "తరువాత కథ తెలిసిందే! ప్రతి లీలలోను ఒక పరమార్థం. నల కూబర, మణి గ్రీవులనే యక్షులు నారద శాపం వలన రెండు పెద్ద చెట్లుగా పడివున్నారు. మరి వారి శాపం తీర్చాలిగా. అందుకనే రోలు ఈడ్చుకొంటూ వాటి మధ్యగా పోయాడు. స్త్రీలతో జలకాలాడుతూ నారదుని విస్మరించినందుకే వారికా శాపం. ఆ చెట్ల మధ్య బలంగా రోలు లాగాడు. అంతే వేళ్ళతో సహా ఆ చెట్లు పెకిలింప బడ్డాయి. శాపం తీరింది. ఆ మద్ది చెట్ల నుండి తేజస్సుతో ఇద్దరు యక్షులు వచ్చారు. స్వామి పాదాలపై వ్రాలారు. ఎంత చక్కగా స్తుతించారో!

**నీ పద్యావళు లాలకించు చెవులున్ నిన్నాడు వాక్యంబులున్**
**నీ పేరంబని సేయు హస్త యుగముల్ నీ మూర్తిపై చూపులున్**
**నీ పాదంబుల పొంత మ్రొక్కు శిరముల్ నీ సేవపై చిత్తముల్**
**నీ పై బుద్ధులు మాకు నిమ్ము కరుణన్ నీ రేజ పత్రేక్షణా "**

వారిని కరుణించాడు స్వామి. తమలోకాలకు చేరారు వారు. ఈ దామోదర బంధనం తలచుకొని స్వామి దొంగ ఏడుపు, దొంగ ఎక్కిళ్ళు పెట్టడం భావించుకొని "కన్నా అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడవు. భక్తి కలవారిచేత ఇంతగా కట్టబడి నీ సౌలభ్యాన్ని చూపించావా" అంటూ నమ్మాళ్వార్లు పడిన వ్యామోహం వారి కృష్ణ భక్తికి, రూపు దాల్చిన కృష్ణ తృష్ణకి శాశ్వతంగా ఉదాహరణగా నిలిచిపోయింది. నమ్మాళ్వార్ల రచనా సౌందర్యంలో ఈ కృష్ణ తృష్ణ విశ్వరూపం దాల్చి భక్తుల హృదయాలలో శాశ్వతత్వాన్ని సంతరించుకొంది.

# శిష్య వాత్సల్య నిధి అమృత జలధి

(6వ పేజీ తరువాయి) పాదుకలను ఆరాధనా పెరుమాళ్ళ అర్చామూర్తిని సమంగా భావించారు. యతి రాజవైభవం అష్టోత్తర శతనామ స్తోత్రము రచించి ఆచార్య వైభవాన్ని ప్రకాశితం చేశారు. నిత్యం రామానుజాచార్యులకు భోజన కైంకర్య సేవను చేసి శేష ప్రసాదం స్వీకరించేవారు. సదా వాత్సల్య నిధి అయిన జగదాచార్యుల సన్నిధిలోనే నివాసం చేశారు.

భగవద్రామానుజాచార్యులకు ఆండాన్, ఆళ్వాన్ అనువారు ప్రధాన శిష్యులుఅని పెద్దలు చెప్తారు. ఆండాన్ అనగా మొదలియాండాన్ వీరిని దాశరథి అని కూడా అంటారు. గొప్ప గురుభక్తి గల వీరి స్పర్శతో సాలగ్రామం అనే గ్రామ చెరువు నీటిని జల పవిత్రంగావించారు. సన్యాసులు ధరించే త్రిదండానికి గల తెల్లని వస్త్రాన్ని జల పవిత్ర అంటారు. అందుకే మొదలియాడాన్లను రామానుజాచార్యులకు త్రిదండ సమానులుగా భావిస్తారు. రామానుజాచార్యుల గురువుగారగు పెరియనంబి గారి పుత్రిక తో ఆమె అత్తవారింటికి స్త్రీధనంగా జగదాచార్యుల ఆజ్ఞతో వెళ్లారు. జ్ఞానులు, నిరాడంబరులైన వారిని చూచి ఆమె అత్తవారింటి వారు పశ్చాత్తాపంతో తిరిగి పంపించారట! మొదలి ఆండాన్లు కూడా జగదాచార్యుల వాత్సల్యాన్ని అనుభవిస్తూ వారిని భక్తితో సేవించారు. వీరు జగదాచార్యులను గురించి రచించిన. ధాటీ పంచకం ఆచార్య నిష్ఠకు దర్పణం. యతిరాజుల వేద వేదాంత జ్ఞాన నిష్ఠకు నిరూపణం! వీరినే యతిరాజ పాదుక గా, శ్రీ వైష్ణవ దాసర్ గా కీర్తిస్తారు. ఆళ్వాన్లు అంటే కూరత్తాళ్వాన్ వీరిని కురేశులు శ్రీవత్సాంక మిశ్రులు అని కూడా అంటారు. వీరు సాటిలేని ఆచార్యనిష్ఠగలవారు.. ఎంబెరుమాన్, ఎంబెరుమానార్ (శ్రీరంగనాథులు, శ్రీ రామానుజాచార్యులు) లపైన భక్తితో జీవితాన్ని గడిపారు. సిద్ధాంత రక్షణలో నేత్రాలను త్యాగం చేశారు. ఆచార్యుల ఆజ్ఞను శిరసా వహించి రామానుజాచార్యులకు అనేక కార్యాలలో సహకరించారు. పంచస్తవాలు అను గొప్ప స్తోత్రాలను రచించారు. సాంప్రదాయ విస్తరణలో వారు చేసిన కృషి సాటి లేనిది. వీరు గొప్ప పాండిత్య ప్రకర్ష కలవారు. సంపదలు కలిగి యున్నను నిరాడంబరంగా జీవించారు. భగవంతుడే రామానుజాచార్యులకు శిష్యులుగా అనుభవాన్ని పొందదలచి కూరేశులుగా అవతరించారని పెద్దలు ప్రవచిస్తారు.

వీరిలాగే గోవింద భటర్లు, అరుళాలపెరుమానెంబెరుమానార్ మరియు అనేకమంది శిష్యులు వాత్సల్య నిధి అగు రామానుజాచార్యుల చేత ఉపదేశితులై ఆచార్యుల వలె తాము కూడా సాంప్రదాయ విస్తరణకు కృషి చేశారు. గురు శిష్య సంబంధానికే ఆదర్శభూతులు అయ్యారు.

# శూర్పణఖ తత్వము



**శ్రీమాన్ శ్రీ శిరిశినహళ్ వెంకటాచార్యులు**

**(గతసంచిక తరువాయి)** అపురూప మృగానికి ఆశపడింది సీతమ్మ. రామున్ని పిలిచింది. లక్ష్మణునికి చూపింది. రాముడు కాదనలేకపోయాడు. లక్ష్మణుడు వద్దన్నాడు. అయినా వినలేదు సీత, జీవుని నిర్ణయానికి దేవుడు తోడవుతాడు. సీతమ్మ నిర్ణయించుకుంది. రాముడు అంగీకరించాడు. సీతను విడిచి మృగం వెంట పడ్డాడు. "మాయకు లొంగిన సీత మాధవునికి దూరమయింది. భౌతిక సంపత్తు కోసం భగవంతుణ్ణి పణంగా పెట్టింది. సంసారంలో ఉన్న మనం మాత్రం చేస్తున్న పని యేమిటి? ఇదేకదా?

కరుణామయుడు పరమాత్మ - మనము విడిచినా తాను విడువడు. మనను రక్షించే బాధ్యత తానే తీసుకుంటాడు. తాను కాకపోయినా తనవాళ్ళను అందుకు నియమిస్తాడు. తాను లేని పర్ణశాలలో సీత రక్షణ కోసం లక్ష్మణున్ని నియమించాడు ప్రకృతిలో పడి ఉన్న జీవుల రక్షణార్థమై గురువును నియమించినట్లు.

సీతా! అన్న ఆర్తనాదం చెవిలో పడింది. అచ్చంగా అది రాముని గొంతే. సీత ఉలికి పడ్డది. గుండె కొట్టుకోసాగింది. రామునికేదో ప్రమాదం జరిగింది అనుకున్నది సీత, రక్షణ కోసం లక్ష్మణున్ని పురమాయించింది. గత్యంతరం లేని పరిస్థితి వచ్చింది. విధిలేక సీతమ్మను విడిచిపోయాడు లక్ష్మణుడు.

పంచవటిలో ఒంటరి సీత. దేవుడులేని గుడిలో దీపంలా ఉంది. గురువులేని విద్యలా గుడ్డిగా వెలుగుతుంది. కళ్ళల్లో వత్తులు వేసికొని రామునికోసం ఎదురుచూస్తున్నది. రాముడు రాలేదు సరికదా రావణుడు వచ్చాడు. సుఖం కోసం వెతికితే దుఃఖం ఎదురైంది. ఇది ఎలా జరిగింది? శూర్పణఖ చలువే మరి!

జనపథంలో మాయమై లంకలో తేలింది. రక్తం నిండిన ముఖం రావణునికి చూపింది. చెల్లెలి చెవిలో రక్తం. అన్న కళ్ళల్లో ఎర్రదనం నింపింది. ముక్కులేని చెల్లెమాట అన్న చెవిలో మారుమ్రోగింది. రావణుడు ఆవేశంతో ఊగిపోయాడు. ఆ ఊపులోనే సీతమ్మ సంగతి చెప్పింది శూర్పణఖ. సీతమ్మ అందాన్ని వాని గుండెలో దింపింది.

రావణునిలోని కోపం కామంతో కలిసింది. పుట్టుకతో వున్న 'అహం' పురెకెక్కి తాండవించింది. కామం, క్రోధం, అహం అన్నీ కలిసి రాక్షసత్వాన్ని వెలికి తీశాయి. 'రావణ బ్రహ్మ రాక్షసరాజుగా మిగిలి పోయాడు. రక్కసి రాచరికానికి మాయలాడు దారి చూపాడు. రావణ సన్యాసి పర్ణశాల ప్రవేశించాడు.

సీతకేం తెలుసు పాపం! ఆయనెవరో సన్యాసి, అతిథిగా వచ్చాడనుకున్నది. మర్యాద చేసింది. మనసు విప్పి మాట్లాడింది. అదను చూచి అసలు రూపం బయట పెట్టాడు వాడు. సీతమ్మ గడ్డిపరక కన్న హీనంగా చూచింది వాణ్ణి.

అహం దెబ్బతిన్నది. తుఫానులా ముందుకు ఉరికాడు. అరటాకులా వణికిపోయింది. ఆమె ఉన్న నేలనే పై కెత్తాడు. ఆకాశం లోకి ఎగిరిపోయాడు.

విలవిలలాడింది సీతమ్మ. ఆదుకొమ్మని అరచింది. అడవంతా ప్రతిధ్వనించింది. అయినా ఎవడూ కిక్కురుమనలేదు. అక్కడి చెట్లు తమ చెవులను ఆకులతో కప్పేసుకున్నాయి. అక్కడి గుట్టలు తమ గుండెలను రాళ్ళు చేసుకున్నాయి. పక్షులన్ని ముక్కు కింద మూగతనం నింపుకున్నాయి. గోదావరి నిండా పిరికితనం పారసాగింది. ఎదురుగాలిని కూడ ఏడిపిస్తూ ముందుకు సాగుతున్నాడు రావణుడు.

గాలిలో తేలి వచ్చింది ఒక ముసలిపక్షి. దాని పేరు జటాయువు. అప్పటికే దాని ఆయువు జడలు కట్టింది. అయినా ఆకాశంలో రావణున్ని ఎదురించింది. రెక్కల్లో బలం చిక్కి పోయేదాకా పోరాడింది. కాళ్ళ కింద గోళ్ళు అరిగి పోయేదాకా బరికింది. ముక్కంతా ముక్కలైనా వాని ఒళ్ళునిండా చిల్లులు పొడిచింది. చివరి క్షణందాక చీల్చి చెండాడింది. అయినా పిట్ట ప్రాణ మెంతుంటది? కొన ఊపిరితో నేల మీద కూలింది. పరమాత్మకు దూరమైతే పక్షి మాత్రం రక్షించగలుగుతుందా? భగవంతుని ప్రీతికోసం చేతనైంది చేసితీరింది.

ఆకాశంలో దూసుకుపోయాడు రావణుడు. అడ్డగించే వాడెవడు లేడు. అరుస్తుంది సీతమ్మ. వినేవాడే లేడు, విశాలమైన సముద్రం విస్తుపోయి చూస్తున్నది. దాన్ని కూడా దాటేసి లంకకు చేరాడు. లంకలో సీతమ్మ బంది అయి కూర్చున్నది.

ఇంతచేసిన శూర్పణఖ ఏమైందో ఆచూకి కూడా తెలియదు! సీతమ్మ మాత్రం కష్టాల పాలయింది!!

తనకు లాభం లేకున్నా ఎదుటివారి సంసారం తగుల బెట్టే లక్షణాలు సుప్పనాతి చేష్టలే మరి! శూర్పణఖ తత్వమే సుప్పనాతి చేష్టలని వాడుకలో నిలిచింది.

# కరీంనగర్ లో శ్రీవారి ఆలయం













కరీంనగర్ జిల్లా, పద్మానగర్‌లో టీటీడీ శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ నిర్మాణానికి మే 31 తేదిన ఉదయం శంకుస్థాపన, శిలాన్యాస కార్యక్రమం విజయవంతంగా జరిగింది. సాంప్రదాయ సిద్ధంగా జరిగిన కార్యక్రమంలో మంత్రి గంగుల కమలాకర్, పట్టణ ప్రణాళిక చైర్మన్ బోయినపెల్లి వినోద్ కుమార్, నారదాసు లక్ష్మణరావు(MLC), నగర మేయర్ సునీల్ రావు, డిప్యూటి మేయర్ స్వరూప రాణి, హరిశంకర్, టీటీడీ చైర్మెన్. సుబ్బారెడ్డి తిరుమల అర్చకులు వేణుగోపాల దీక్షితులు స్థానిక వేద పండితులు. అనేక మంది భక్తులు పాల్గొన్నారు. సాయంత్రం శ్రీవారి కళ్యాణం వైభవంగా జరిగింది. శ్రీవారి లడ్డు ప్రసాదాన్ని భక్తులకు పంచారు.

# ఆధ్యాత్మిక వార్తలు



సిరిసిల్లలో ప్రజ్ఞా క్లాసులలో అంజన, శ్రీనివాస్, సమ్మయ్య మరియు జి.సువర్ణ మొదలగు వారు పాల్గొన్నారు.



వనపర్తిలో వికాసతరంగిణి వారు ప్రజ్ఞక్లాసులు నిర్వహిస్తున్న దృశ్యం



కరీంనగర్ వేద భవనంలో వేసవి శిబిరం ప్రజ్ఞ తరగతుల ముగింపు సమావేశంలో జిల్లా విద్యాధికారి. జనార్ధన్‌రావు. గౌతమ్‌రావు, వేణు గోపాల్‌రావు, శ్రీసన్నిధానం సంపాదకులు సముద్రాల శారద, శ్రీదేవి, విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.

## సంస్కృత సంభాషణ శిక్షణ తరగతులు

**దేవ భాషలో మాట్లాడుకుందాం!!**

సంస్కృతి సంప్రదాయాల సంరక్షణలో భాగంగా చిలుకూరు బాలాజీ అనుగ్రహం ద్వారా **ఉచితంగా** ఆన్‌లైన్‌లో

**SPOKEN SANSKRIT CLASSES**

జూన్ 1 నుండి తరగతులు ప్రారంభం

వివరాలకు సంప్రదించండి!!

బి.తిరుమలేశ్ ఫోన్: 9491869417


శ్రీ చిలుకూరి బాలాజీ స్వామి వారి ఆశీస్సులతో...

మీ ఇంట్లో జరిగే ఏలాంటి శుభకార్యాలలోనైన మేము మీ ఇంటికి వచ్చి భగవద్గీత 700 శ్లోకాలు (18 అధ్యాయాలు) పారాయణం చేస్తాము.

ON ANY OCCATION IN YOUR HOUSE WE RECITE THE WHOLE BHAGAVADGEETHA 700 SLOKAS (18 CHAPTERS) Like..

| | |
|---|---|
| 1. జన్మదినం | 1. BIRTHDAY |
| 2. వివాహ దినం | 2. WEDDING DAY |
| 3. గృహ ప్రవేశం | 3. HOUSE WARMING |
| 4. విదేశీ గమనం... | 4. FORIEGN STUDIES.. etc |

సంస్కృతం - శ్రీమద్భగవద్గీత నేర్పించబడును

WE TEACH THE SANSKRIT - BHAGAVADGEETHA

CELL: 9491869417

YOUTUBE CHANNEL: VADATA SAMSKRITAM